నేడు ఉద్యమ కళాకారుల సభ

కాచిగూడ: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, తెలంగాణ ఉద్యమ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఉద్యమ కళాకారుల సభ నిర్వహిస్తున్నట్లు టీయూజేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రధానకార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నారాయణగూడలో వారు మాట్లాడుతూ కళాకారుల ఆట -పాటలు, ఉద్యమకారుల ప్రసంగాలు, భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ అమరవీరులు, ఉద్యమకారులు, కళాకారుల సంక్షేమం, అభివృద్ధి విషయాలపై చర్చించి పలు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వమైన ఇచ్చిన హామీలు అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏముల యాదగిరి, డోలక్ యాదగిరి, రాజయ్య, రమేష్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

26న కేవల్ కిషన్ ముదిరాజ్ వర్ధంతి జాతర


కేవల్ కిషన్ వర్ధంతి పోస్టర్ ఆవిష్కరిస్తున్న మద్దెల సంతోష్, శైలేంద్ర శివయ్య

కాచిగూడ: కేవల్ కిషన్ ముదిరాజ్ వర్ధంతి జాతరను ఈ నెల 26న మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లిలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మద్దెల సంతోష్ ముదిరాజ్ తెలిపారు. కేవల్ కిషన్ ముదిరాజ్ వర్ధంతి జాతర పోస్టర్‌ను శనివారం నారాయణగూడలోని ముదిరాజ్ మహాసభ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం జీవితకాలం పోరాటం చేసిన నాయకుడు కేవల్ కిషన్ ముదిరాజ్ అని సొంత భూమిని పేదలకు దానం చేసి భూస్వాముల చేతిలో ఉన్న భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. కేవల్ కిషన్ ముదిరాజ్ వర్ధంతి జాతరలో ముదిరాజ్‌లు, బీసీలు అధిక సంఖ్యలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నేతలు సంతోష్ ముదిరాజ్, శైలేంద్ర, శివయ్య, బైండ్ల సత్యనారాయణ, బోయిని ఆంజనేయులు, దుర్గేష్, పాపన్నపేట, శ్రీనివాస్ తలారి సంతోష్, తిప్పాపురం కృష్ణగౌడ్, ఎడ్లపాల ప్రభు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని రాస్తారోకో


ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో రాస్తారోకో చేస్తున్న ఏఎన్ఎంలు, నాయకులు

ముషీరాబాద్: కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షుడు జె.కుమారస్వామి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్య, ఆరోగ్య శాఖలో అనేక సేవలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపులను అమలు చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించకుండా ప్రభుత్వాలు మోసం చేస్తూనే ఉన్నాయని విమర్శించారు. ప్రజాపాలన, ప్రజాప్రభుత్వం అని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వాల మాదిరిగానే నిర్లక్ష్యం చేయకుండా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.కవిత, కిరణ్మయి, లక్ష్మీభాయి, రమ, బాలమణి, అమ్మాజీ, మంగ, శీలా, సులోచన తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి


వివిధ శాఖల అధికారులకు బీజేపీ వినతి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు శనివారం వివిధ శాఖల అధికారులను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. పవిత్రనగర్ బంగారు మైసమ్మ ఆలయ వద్ద డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, వాటిని వెంటనే పరిష్కరించాలని జలమండలి డీజీఎం మోహన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. స్ట్రీట్‌లైట్లు వెలగడం లేదని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని, వెంటనే స్ట్రీట్ లైట్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు పూస రాజు, డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్‌కుమార్, కుషాల్ కుమార్, సుధాకర్, ఆర్.జనార్దన్, టి.రాజు, సంగయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


జలమండలి డీజీఎం మోహన్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

విజ్ఞానపురి.. దుర్గంధభరితం!

నల్లకుంట: నల్లకుంట డివిజన్‌లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఏ వీధిలో చూసినా ఎక్కడ చెత్త అక్కడే. గృహనిర్మాణ వ్యర్థాలు, చెట్లకొమ్మలు, చెత్తాచెదారం దుర్గంధం వెదజల్లుతున్నాయి. డివిజన్ పరిధిలోని విజ్ఞానపురి కాలనీలో మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త ఐఐటీ చుక్కా రామయ్య ఇంటికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన ఓ వైపు గృహ నిర్మాణ వ్యర్థాలు, మరో పక్క చెట్ల కొమ్మల వ్యర్థాల అక్కడే పేరుకుపోయాయి. చుక్కా రామయ్యను కలవడానికి నిత్యం ప్రముఖులు ఇక్కడికి వస్తుంటారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, మాజీమంత్రి టి.హరీశ్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వచ్చారు. ఇక్కడికి తరుచూ వీఐపీలు వస్తున్నప్పటికీ ఇక్కడ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడంలో పారిశుద్ధ్య విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే కాలనీలోని విద్యానగర్ రైల్వే స్టేషన్‌ను ప్రహరీని ఆనుకుని ఉన్న వీధిలో రెండు నెలల క్రితం ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించి అక్కడే వదిలేశారు. దీనికి తోడు సమీపంలో నివాసముండే గుడిసెల్లోని నివాసులు కొందరు తమ ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తీసుకువచ్చి ఇక్కడే పారవేసి వెళుతున్నారు. చెత్తాచెదారం కారణంగా ఇక్కడ తీవ్రమైన దుర్గంధం వెలువడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైల్వే ప్రయాణికులు, సమీపంలోని ఇళ్లవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పారిశుద్ధ్య విభాగం అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.


విద్యానగర్ రైల్వే స్టేషన్ వీధిలో తొలగించని చెట్ల కొమ్మల కుప్ప


విజ్ఞానపురి కాలనీలో మాజీ ఎమ్మెల్సీ ఇంటికి వెళ్లే దారిలో గృహ నిర్మాణ వ్యర్థాలు, చెట్ల కొమ్మలు


విద్యానగర్ రైల్వే స్టేషన్ ప్రహరిని ఆనుకుని ఉన్న వ్యర్థాలు, పార్క్ చేసి ఉంచిన గుర్తు తెలియని వాహనాలు

వైష్ణవాలయాల్లో ధనుర్మాస పూజలు


న్యూరామాలయంలో సీతారామచంద్రులకు పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

నల్లకుంట: ధనుర్మాసం మొదటి శనివారం అంబర్‌పేట నియోజకవర్గంలోని వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. నల్లకుంట డివిజన్‌లోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి దేవాలయం(న్యూ రామాలయం)లో అర్చక స్వాములు అప్పారావు, గౌరీశంకర్‌ల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అభిషేకాలు కావించి, ఉత్సవమూర్తులను వివిధ రకాల పూలమాలలు, తులసి మాలలతో అలంకరించి అర్చనలు, పూజలు నిర్వహించారు. హనుమంతుడికి వడ మాల, తమలపాకుల(ఆకు), సింధూర పూజలు కావించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ కృష్ణ మందిరంలో రాధాకృష్ణులకు అర్చక స్వామి నాగేంద్ర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇష్టదైవాల దర్శనం కోసం వచ్చిన భక్తులకు తీర్థప్రసాద వితరణ కావించారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి

ప్రొఫెసర్ మోహన్‌గోపాల్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలైన లౌకిక, ప్రజాస్వామ్య విలువలను, స్ఫూర్తిని రక్షించాల్సిన బాధ్యత న్యాయవిద్యార్థులపై ఉందని నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మోహన్ గోపాల్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఐలు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మోహన్ గోపాల్ మాట్లాడుతూ న్యాయమూర్తుల నియామకం రాజకీయ జోక్యం లేకుండా అన్ని వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. మనదేశంలో అనధికార అత్యవసర పరిస్థితి నడుస్తోందని, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ కంటే ఇది ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ టి.వి.సురేంద్రనాథ్, బార్‌కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, రాష్ట్ర ప్రతినిధులు నర్రా శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, సి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన ఐలు సదస్సులో మాట్లాడుతున్న మోహన్‌గోపాల్

కాంట్రాక్ట్ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతల డిమాండ్


ధర్నాలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు

కవాడిగూడ: కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే తదితర పద్ధతుల్లో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బంది అందిరినీ వెంటనే పర్మనెంట్ చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు భాస్కర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జనగాం రాజమల్లు, కార్యదర్శి పి.సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్నా నర్సింహులు, రాష్ట్ర మహిళా కన్వీనర్ నాగమణి, రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులు గుర్రం అశోక్, ఉప్పలయ్య, ఎస్ వెంకటస్వామి హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలలో సుమారు 65 వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే పద్ధతుల్లో ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. రెండో పీఆర్‌సీ కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఆ లోపు ఏపీలో మాదిరిగా రూ.21 వేల వేతనం అమలు చేయాలని, కేటగిరీలవారీగా వేతనాలు ఇవ్వాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, అర్హత కలిగిన వారికి ప్రమోషన్ల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డిమాండ్లను ఆమోదించాలని, లేనియెడల రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


ధర్నాకు హాజరైన మున్సిపల్ కార్మికులు

గణితశాస్త్రవేత్తలకు మార్గదర్శి శ్రీనివాస రామానుజం

చిక్కడపల్లి: గణిత శాస్త్రంలో అపార మేధాసంపన్నుడు శ్రీనివాస రామానుజం గణిత శాస్త్రవేత్తలకు మార్గదర్శి లాంటివాడని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం సాయంత్రం త్యాగరాయ గానసభలోని కళాసంగీత నాటక వేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న 'ఎందరో మహానుభావులు'కార్యక్రమ పరంపరలో భాగంగా శ్రీనివాస రామానుజం యాదిలో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. కీలక ప్రసంగం చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత ఉన్నతాధికారి చింతలపూడి త్రినాథరావు మాట్లాడుతూ భారతీయ గణితశాస్త్రంలోని లోతులను అధ్యయనం చేసి ప్రపంచానికి చాటిన శ్రీనివాస రామానుజం ప్రతిపాదించిన సూత్రాలు గణిత శాస్త్రవేత్తలకు ఉపయుక్తమని వివరించారు. ఈ కార్యక్రమంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన వేదికపై గాయకుడు శ్రీధర సుబ్రహ్మణ్యం, గాయని అమంత, శంకరప్రసాద పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చిక్కడపల్లి: గుర్తు తెలియని వ్యక్తి(40) గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ కథనం ప్రకారం... ఈ నెల 19న ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని జవహర్ నగర్‌లోని స్వాతి వైన్స్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఒకరు పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనారోగ్యం కారణంగా మాట్లాడలేకపోవడంతో వివరాలు తెలియరాలేదు. పరిస్థితి విషమించడంతో అతడు మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

పైపులైన్ పనుల పర్యవేక్షణ


నింబోలిఅడ్డలో వర్షపునీటి పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న కన్నె ఉమారమేష్

కాచిగూడ: నింబోలిఅడ్డలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వర్షపునీటి పైపులైన్ నిర్మాణ పనులను శనివారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ జిహెచ్ఎంసీ సిబ్బంది, అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆమె కోరారు. నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులను చేపట్టాలని ఆమె సూచించారు. అనంతరం స్థానిక బస్తీల్లో ఆమె పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్, నరేష్, మురళి, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, నర్సింగ్ యాదవ్, ప్రేమ్, బి.భీంరాజ్, రవియాదవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దయానంద్ యాదవ్‌కు ఉద్యోగపతి పురస్కారం


పారిశ్రామికవేత్త దయానంద్ యాదవ్

కాచిగూడ: ప్రఖ్యాత వ్యాపారవేత్త రతన్‌టాటా 86వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పారిశ్రామిక వేత్త బండారి దయానంద్ యాదవ్‌ను రతన్‌టాటా స్మారక 'ఉద్యోగపతి' అవార్డు -2024కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. దయానంద్ యాదవ్ ఎస్‌డీఎస్ఎంసీ గ్రూపు సంస్థ ద్వారా వేలాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. ఈ నెల 28న బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో దయానంద్ యాదవ్‌కు అవార్డును అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

దళితగొంతుక వీటీ రాజశేఖర్

ప్రొఫెసర్ కంచ ఐలయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దళితుల గొంతుక వీటీ రాజశేఖర్ అని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. ఆధిపత్య కులానికి చెందిన వీటీ రాజశేఖర్ దళితుల పక్షాన నిలబడి పోరాటం చేశారని కొనియాడారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సమాంతర బుక్‌హౌస్ ఆధ్వర్యంలో దళిత వాయిస్ ఎడిటర్, రచయిత, అంబేడ్కర్‌వాది వీటీ రాజశేఖర్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా తొలితరం దళితనేత బత్తుల శ్యామ్ సుందర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కంచ ఐలయ్య మాట్లాడుతూ మహారాష్ట్రలో జరిగిన దళిత ఉద్యమాన్ని దేశమంతటా ప్రచారం చేసిన గొప్ప వ్యక్తి వీటీ రాజశేఖర్ అని పేర్కొన్నారు. దళిత్ అనే పదానికి అర్థం చెప్పిన గొప్ప మేధావి అని కొనియాడారు. దళిత, ముస్లిం ఐక్యత కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో వీటీ రాజశేఖర్ కుమారుడు సలీం శెట్టి, ధర్మ స్వరాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్, నాయకులు మసూద్, ప్రకాష్ మూలభారతి, డాక్టర్ అలీంఖాన్, వరుణ్‌కుమార్, జీవీ సూర్యకిరణ్, కొరివి వినయ్‌కుమార్, డి.బి.ఎఫ్. జాతీయ కార్యదర్శి పి.శంకర్, క్రాంతికిరణ్ పాల్గొన్నారు.


వీటీ రాజశేఖర్ సంస్మరణ సభలో బత్తుల శ్యామ్‌సుందర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

ఎస్సీ,ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ నేతల డిమాండ్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ నేతలు

కవాడిగూడ: పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ నేతలు డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫ్రంట్ నేతలు సనా ఉల్లాఖాన్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, డి.బి.ఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, బేడబుడగ జంగం నాయకులు రాంబాబు, అణగారిన కులాల హక్కుల సంఘం నాయకులు సీఎల్ యాదగిరి, నర్సింగ్‌రావు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అహంకార పూరితంగా మాట్లాడిన అమిత్‌షా పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి బేషరతుగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై ఆప్ నిరసన

కవాడిగూడ: రాజ్యాంగం ద్వారా దేశపౌరులకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. అణగారిన ప్రజల గొంతుక అయిన అంబేడ్కర్‌ను అగౌరవపర్చుతూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. శనివారం ఆప్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఖూనీ చేసి మనుస్మృతిని తీసుకురావడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో అడ్వకేట్ యమున గౌడ్, డాక్టర్ లక్ష్యానాయుడు, విజయ్ ముల్లంగి, అప్సా సలాం, జావిద్ షరీఫ్, కలీం బాబా, సుధారాణి, జయసింగ్ యాదవ్, వైశాలి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఆప్ నేతలు

'మ్రోయు తుమ్మెద' పుస్తక ఆవిష్కరణ

కవాడిగూడ: జ్ఞానపీఠ పురస్కార అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'మ్రోయు తుమ్మెద'పుస్తకావిష్కరణ సభ ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బుక్ ఫెయిర్‌లోని బోయి విజయభారతి వేదికపై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ రచనల్లో ఇది విశిష్టమైన పుస్తకమని, దీన్ని ప్రపంచంలోని అన్ని భాషల్లోకి అనువదించాలని అన్నారు. కార్యక్రమంలో తన్నీరు శ్రీనివాస్, డాక్టర్ చింతమనే శ్రీనివాస్ హాజరయ్యారు.



మ్రోయుతుమ్మెద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న పంతుల గోపాల కృష్ణ



దూపాటి ప్రభాకర్ అద్భుత కథకుడు

కవాడిగూడ: ప్రముఖ కవి దూపాటి ప్రభాకర్ అద్భుతమైన కథకుడని హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు కవి యాకూబ్ కొనియాడారు. శనివారం బుక్ ఫెయిర్‌లోని బోయి విజయభారతి వేదికపై ప్రభాకర్ రచించిన 'వెలుగు వైపుగా'పుస్తకాన్ని ఆవిష్కరించారు. పంతుల గోపాలకృష్ణ ఆ పుస్తకాన్ని పరిచయం చేస్తూ దూపాటి ప్రభాకర్ ఎంచుకున్న కథ కవిత్వానికి కూడా ఊపిరి పోసిందన్నారు. కార్యక్రమంలో గంటి జానకి, సుగుణ, సావిత్రి రమణ రావు, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

'మానవాళికి మహోదయం'ఆవిష్కరణ

కవాడిగూడ: ప్రముఖ రచయిత పాపారావు రచించిన మానవాళికి మహోదయం పుస్తకాన్ని బుక్ ఫెయిర్‌లోని తోపుడు బండి సాదిక్ వేదికపై శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ ఆవిష్కరించారు. సీనియర్ జర్నలిస్టు వేణుగోపాల్ పుస్తక పరిచయం చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, జతిన్, పబ్లిషర్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

